

విశాఖలో ఆయుధాలు స్వాధీనం

- ట్రావెల్ ఏజెన్సీలో పనిచేస్తున్న వ్యక్తి నుంచి రివాల్వర్, పిస్టల్, రెండు బుల్లెట్స్ సీజ్


... వివరాలు మెయిన్ 3వ పేజీలో



పోలీసులు సీజ్ చేసిన ఆయుధాలు

తాండవ ఇప్పట్లో బాగుపడదా!?

రెగ్యులేటర్ గేట్ల లీకేజీతో వృథాగా పోతున్న నీరు





గేట్లకు మరమ్మతులు చేయకపోవడంతో కాలువలో వృథాగా పోతున్ననీరు (ఇన్‌సెట్‌లో) రిజర్వాయర్ పంట కాలువ ప్రధాన రెగ్యులేటర్. నీరు లీకవుతున్నది ఈ గేట్ల నుంచే! (ఫైల్ ఫొటో)

- మూడేళ్ల నుంచి ఇదే పరిస్థితి
- ప్రతిపాదనలకే పరిమితమైన నిధులు మంజూరు
- ఎట్టకేలకు గత ఖరీఫ్ సీజన్‌లో రూ.9 లక్షలు కేటాయింపు
- ఒకటి.. రెండు.. మూడుసార్లు టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు
- కాలువల్లో పూడిక తీతకు రూ.32 లక్షలు మంజూరు
- ఈ పనులకు కూడా కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలుచేయని వైనం
- ఎన్నికల కోడ్‌తో జూన్ వరకు టెండర్లు పిలవలేని పరిస్థితి
- రానున్న ఖరీఫ్‌లో కూడా రైతులకు తప్పని ఇక్కట్లు

నర్సీపట్నం/ నాతవరం, మార్చి 24:

తాండవ రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేసే మెయిన్ గేట్లు మరమ్మతు పనులు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. సుమారు తొమ్మిది లక్షల రూపాయలతో ఈ పనులు చేపట్టడానికి అధికారులు టెండర్లు పిలవడం, కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేయకపోవడం పరిపాటిగా మారింది. ఏడు నెలల వ్యవధిలో మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఏం చేయాలో అధికారులకు పాలుపోవడంలేదు.

నాతవరం మండలంలో తాండవ నదిపై నిర్మించిన 'రాజా సాగి సూర్యనారాయణరాజు తాండవ ప్రాజెక్టు' జలాశయం కింద అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో 51,465 ఎకరాల ఆయకట్టు వుంది. ఇందుల్లో 32,689 ఎకరాలు అనకాపల్లి జిల్లా నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల మండలాల్లో, 18,776 ఎకరాల ఆయకట్టు కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో వుంది. జిల్లాలో ఏకైక మేజర్ ప్రాజెక్టు అయినప్పటికీ ఏటా ఒక్క పంటకే (ఖరీఫ్) నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టుకు సంబంధించి స్పిల్‌వే గేట్లు, ఆయకట్టుకు నీటిని విడుదల చేసే రెగ్యులేటర్ గేట్లు నిర్వహణ, పంట కాలువల్లో తుప్పలు తొలగింపు, పూడికతీత, మదుములకు మరమ్మతులు వంటి పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టాలి. కానీ కొన్నేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ, మరమ్మతు పనులు చేయడంలేదు. ముఖ్యంగా ప్రధాన కాలువ రెగ్యులేటర్ గేట్ల రబ్బర్ బుష్‌లు అరిగిపోయి నిరంతరాయంగా నీరు లీకవుతున్నది. ఇంకా కాలువల్లో పూడిక తీయకపోవడంతో నీటి ప్రవాహం తగ్గిపోయి ఆయకట్టుకు సక్రమంగా నీరు అందడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కాలువ రెగ్యులేటర్ గేట్లకు మరమ్మతు చేయించి, కాలువల్లో పూడికలు తీయించాలని వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కోరుతున్నారు. రెగ్యులేటర్ గేట్లకు మరమ్మతులు చేయకపోవడంతో ఆయకట్టుకు నీరు అవసరం లేని సమయంలో వృథాగా నీరు పోతున్నది. గేట్లకు మరమ్మతులు, కాలువల్లో పూడిక తీత పనులకు ప్రాజెక్టు అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపడం, ఉన్నతాధికారులు పక్కన పెట్టడం ఆనవాయితీగా మారింది. ఎట్టకేలకు గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో గేట్లకు మరమ్మతు కోసం ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసింది. పనులు చేపట్టడానికి అధికారులు టెండర్లు పిలిచారు. ఒక్క కాంట్రాక్టర్ కూడా బిడ్ దాఖలు చేయలేదు. కొద్ది రోజుల తరువాత మళ్లీ టెండర్లు పిలిచారు. మళ్లీ షరా మామూలే! ఫిబ్రవరిలో ముచ్చటగా మూడోసారి టెండర్లు పిలిచారు. అయినా స్పందన లేదు. గత వారం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకూడదు. టెండర్లు కూడా పిలవకూడదు. జూన్ మొదటి వారం వరకు ఎన్నికల కోడ్ అమల్లో వుంటుంది. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరైన నిధులు ఈ ఏడాది మార్చిలోగా ఖర్చు చేయకపోతే వెనక్కుమళ్లుతాయి. పనులు చేయాలంటే మళ్లీ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలి. ఆమోదం లభించిన తరువాత టెండర్లు పిలిపి పనులు చేయించాలి. ఈ ప్రక్రియ ఎప్పటి పూర్తవుతుందో తెలియదు.

కాలువల్లో పేరుకుపోయిన పూడిక

తాండవ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల్లో పూడిక పేరుకుపోయింది. కొన్నిచోట్ల తుప్పలు, గడ్డి పెరిగిపోయి నీరు సరిగా పారడం లేదు. ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు పంట కాలువల్లో తుప్పలు తొలగించి, పూడిక తీయిస్తుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పూడిక తీయడంలేదు. దీనివల్ల కాలువల్లో నీటి ప్రవాహం మందగించి నాతవరం మండలం పీకే గూడెం, పి.జగ్గంపేట, జిల్లెడపూడి, చెర్లోపాలెం, కోటనందూరు మండలం కేఈ చిన్నయ్యపాలెం, కోటవురట్ల మండలం పాములవాక గ్రామాల్లో ఆయకట్టు చివరి భూములను నీరు సక్రమంగా అందడంలేదు. గత ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, మరోవైపు కాలువ నుంచి నీరు సరిగా రాకపోవడంతో పంటలు ఎండిపోయాయని ఆయా గ్రామాల రైతులు వాపోయారు. కాగా నాలుగు ప్రధాన కాలువల్లో పూడికతీత పనులకు రూ.8 లక్షల చొప్పున రూ.32 లక్షలను ప్రభుత్వం గత ఏడాది మంజూరు చేసింది. పనులు చేపట్టడానికి అధికారులు రెండుసార్లు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు బిడ్లు దాఖలు చేయలేదు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం రెగ్యులేటర్ గేట్ల వద్ద నీరు తక్కువగా వుంది. ఇటువంటి సమయంలోనే గేట్లకు మరమ్మతులు చేయాలి. అదే విధంగా కాలువల్లో పూడికతీతకు కూడా ఇదే సరైన సమయం. కానీ ఎన్నికల కోడ్ కారణంగా జూన్ మొదటి వారం వరకు టెండర్లు పిలిచే పరిస్థితి లేదు. తరువాత వర్షాలు మొదలైతే రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరిగి రెగ్యులేటర్ గేట్ల వద్ద భారీగా నీరు చేరుతుంది. అప్పుడు మరమ్మతు చేయడం కష్టం అవుతుంది. కాలువల్లో పూడిక తీత కూడా సాధ్యం కాదు. మొత్తం మీద రానున్న ఖరీఫ్ సీజన్‌లో కూడా నీటి వృథా, తమకు కష్టాలు తప్పవని తాండవ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ఎంపీ అభ్యర్థి ఖరారు



సీఎం రమేశ్, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి

- అనకాపల్లికి సీఎం రమేశ్ పేరును ప్రకటించిన బీజేపీ అధిష్ఠానం
- ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే తొలిసారి

అనకాపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారన్న ఉత్కంఠకు తెరపడింది. పొత్తులో భాగంగా భారతీయ జనతా పార్టీకి కేటాయించిన ఈ నియోజకవర్గం నుంచి రాజ్యసభ సభ్యుడు, సీనియర్ నేత సీఎం రమేశ్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు బీజేపీ కేంద్ర నాయకత్వం ఆదివారం అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేశ్ పేరును ప్రకటించింది.

రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా (ఎన్‌డీఏ) ఏర్పడి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలో ఒక లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలు వుండగా... టీడీపీ-జనసేన కూటమిలో బీజేపీ చేరకముందు ఎంపీ సీటుతో పాటు రెండు అసెంబ్లీ సీట్లలో జనసేన పార్టీ, మిగిలిన నాలుగు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ పోటీ చేయాలని భావించాయి. అయితే టీడీపీ, జనసేన పార్టీలతో బీజేపీ జట్టు కట్టడంతో అనకాపల్లి ఎంపీ స్థానాన్ని బీజేపీకి విడిచిపెట్టారు. అసెంబ్లీ స్థానాల్లో మార్పులేదు. నాలుగు చోట్ల టీడీపీ, రెండు స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్నాయి. ఈ రెండు పార్టీల తరఫున ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు దాదాపు ఖరారయ్యారు. రాష్ట్రానికి సంబంధించి బీజేపీ శనివారం వరకు ఒక్క జాబితాలను కూడా విడుదల చేయకపోవడంతో అనకాపల్లి ఎంపీ టికెట్‌ను ఆ పార్టీ అధిష్ఠానం ఎవరికి కేటాయిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పేరు తెరపైకి వచ్చింది. ఇంకా ఒకటి, రెండు పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ సీఎం రమేశ్ పేరునే అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో రానున్న ఎన్నికల్లో జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు కూటమి తరఫు పోటీ చేస్తున్న అభ్యర్థులపై స్పష్టత వచ్చేసింది.

టీడీపీతో రాజకీయ ప్రస్థానం

కడప జిల్లా పోట్లదుర్తి గ్రామంలో మునిస్వామి నాయుడు, రత్నమ్మ దంపతులకు 1965 జూన్ 12న సీఎం రమేశ్ జన్మించారు. ఆయనకు భార్య సీఆర్ శ్రీదేవి, కుమారుడు రిత్విక్, కుమార్తె రిత్విన్ ఉన్నారు. రిత్విక్ ప్రాజెక్టు పేరుతో వ్యాపార రంగంలో ఉన్న సీఎం రమేశ్.. 1997లో తెలుగుదేశం ... మిగతా 8వ పేజీలో

మరో రెండు సీట్లకు జనసేన అభ్యర్థులు ఖరారు



పంచకర్ల రమేష్‌బాబు



సుందరపు విజయకుమార్

- పెందుర్తికి పంచకర్ల, ఎలమంచిలికి సుందరపు
- అనకాపల్లికి కొణతాల రామకృష్ణ పేరును గతంలోనే ప్రకటించిన అధిష్ఠానం
- పెండింగ్‌లో విశాఖ దక్షిణ నియోజకవర్గం

విశాఖపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):

పొత్తులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన పార్టీకి కేటాయించిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను మరో రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ పేరును మొదటి జాబితాలోనే వెల్లడించగా, తాజాగా విడుదల చేసిన మరో జాబితాలో పెందుర్తి నుంచి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలి ... మిగతా 8వ పేజీలో

అవయవదాతల కోసం ఎదురుచూపులు



ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం వేలాది మంది నిరీక్షణ

- రిజిస్ట్రేషన్లకు అనుగుణంగా పెరగని దాతల సంఖ్య
- రోగులకు తప్పని ఇబ్బందులు
- జీవన్‌ధాన్‌లో 3,409 మంది రిజిస్ట్రేషన్
- లివర్‌కు 1,010, కిడ్నీకి 2,325, హార్ట్‌కు 62, లంగ్స్ కోసం 12 మంది దరఖాస్తులు
- రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిదేళ్లలో 3,343 మంది రోగులకు అవయవ మార్పిడి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అవయమార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అవయవాల కోసం దరఖాస్తు (రిజిస్ట్రేషన్) చేయించుకుం టున్న వారి సంఖ్య రెట్టింపవుతోంది. ఏటా పదుల సంఖ్యలో రోగులు ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం జీవన్‌ధాన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న వారి సంఖ్యకు అనుగుణంగా అవయవాల లభ్యత లేకపోవడంతో రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. అవయవ మార్పిడికి అవకాశం లేకపోవడంతో దీర్ఘకాలిక వైద్యమే శరణ్యమవుతోంది. అంతేకాక సకాలంలో మార్పిడి జరగక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులు బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వీరిలో చాలా మందికి అవయవ మార్పిడి శస్త్రచికిత్స అవసరం. ఈ విధా నాన్ని పర్యవేక్షిస్తున్న జీవన్‌ధాన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏటా సుమారు 200 మంది రోగులు దరఖాస్తు చేస్తున్నారంటే పరిస్థితి ఏస్థాయిలో ఉందో తెలుస్తోంది. ఆయా వ్యాధుల బారినపడుతున్న వారిలో రెండు నుంచి మూడు శాతం మందికి మాత్రమే అవయవ మార్పిడి అవసరం ఏర్పడుతోంది. అయినప్పటికీ పదుల సంఖ్యలో దరఖాస్తులు రావడం వ్యాధుల తీవ్రతకు అద్దం పడుతోందని నిపుణులు చెబుతున్నారు.

పెరుగుతున్న కిడ్నీ, లివర్ బాధితులు..

కిడ్నీ, లివర్ వ్యాధుల బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా చిన్న వయసులోనే ఈ సమస్యలు పెరుగుతున్నాయి. ఆహార అలవాట్లు, ఆల్కహాల్, స్మోకింగ్ వంటి దురలవాట్ల కారణంగా బాధితులు పెరుగుతున్నారు. వీరిలో చాలా మందికి చిన్న వయసులోనే అవయవాలు డ్యామేజ్ అవుతున్నాయి. దీర్ఘకాలం చికిత్స అందించినా ప్రయోజనం లేకపోవడంతో అవయవ మార్పిడి శస్త్రచికిత్స చేయాల్సి వస్తోంది. ఈ తరహా శస్త్రచికిత్సలు అవసరమవుతున్న వారిలో దాదాపు 50 శాతం మంది 40 ఏళ్లలోపు వారే కావడం ఆందోళన కలిగిస్తోంది.

దాతల కోసం ఎదురుచూపులు

ఎంతోమంది బాధితులకు కుటుంబసభ్యుల ఆర్గాన్స్ సరిపడక అవయవదాతలు కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. 2015 నుంచి 2019 వరకు లివర్ కోసం 1,010 మంది రోగులు దరఖాస్తు చేసుకోగా, కిడ్నీ కోసం 2,325 మంది, గుండె మార్పిడి కోసం 62 మంది, ఊపిరితిత్తుల మార్పిడి కోసం 12 మంది ఎదురు చూస్తున్నారు. వీరి బ్లడ్ గ్రూపు, ఇతర వైద్య పరమైన అంశాలు సరిపడిన తరువాత బ్రెయిన్‌డెడ్ అయిన వారి నుంచి సేకరించిన అవయవాలను జీవన్‌ధాన్‌లో రిజిస్టర్ చేసుకున్న వారి జాబితా ప్రకారం అందిస్తారు.

రెండు రకాలుగా అవయవదానం

అవయవమార్పిడి శస్త్ర చికిత్సలను రెండు విధాలుగా చేస్తారు. వీటిలో ఒకటి కెడావర్, రెండోది లైవ్. కెడావర్ అంటే ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడిన వ్యక్తి బతికే చాన్స్ లేద ని (బ్రెయిన్ డెడ్) వైద్యులు నిర్ధారించిన తరువాత కుటుంబ సభ్యుల ... మిగతా 8వ పేజీలో

దరఖాస్తులు పెరిగాయి

అవయవాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో ఏటా పది నుంచి 20 దరఖాస్తులు వస్తుండేవి. ఇప్పుడు ఆ సంఖ్య పెరిగింది. అందుకు అను గుణంగా దాతల సంఖ్య పెరగడం సానుకూల అంశం. అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన రావాలి. అప్పుడే ఏళ్లుగా ఎదురుచూస్తున్న దీర్ఘకాలిక రోగులకు మేలు చేకూర్చేందుకు అవకాశం ఉంటుంది. గత రెండు నెలల్లో 30 మందికి అవయవమార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించాం. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో చేసిన దాఖలాలు లేవు.

- డాక్టర్ కె.రాంబాబు, జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్

రూ.2 లక్షల నగదు సీజ్

- వేంపాడు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో పట్టుకున్న పోలీసులు



నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్న పోలీసులు

నక్కపల్లి, మార్చి 24: మండలంలోని వేంపాడు టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు, ఎటువంటి ఆధారాలు లేకుండా ఒక కారులో తరలిస్తున్న రెండు లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాల రవాణాపై గట్టి నిఘా వేశారు. జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టు వద్ద 24 గంటలూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆదివారం ఉదయం పాయకరావుపేట వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న ఒక కారులో రూ.2 లక్షల నగదు పట్టుకున్నారు. ఈ డబ్బులు తీసుకెళుతున్న గాజువాక కణిత రోడ్డుకు చెందిన గంగుమళ్ల ప్రమోద్ ఎటువంటి పత్రాలు చూపకపోవడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ విజయ్ కుమార్ చెప్పారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.12
సహరి (మంగళ)	4.43

అధ్వానంగా ఆట స్థలం

నిర్వహణ కొరవడిన ఎలమంచిలి క్రీడా మైదానం

- సగం స్థలంలో పెరిగిపోయిన తుప్పలు
- పూడుకుపోయిన డ్రైనేజీ కాలువలు
- వర్షం కురిస్తే చెరువును తలపిస్తున్న మైదానం
- పగలు బహిర్భూమి, చీకటి పడితే ఓపెన్ బార్
- పట్టించుకోని అధికారులు, ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు



మైదానంలో పెరిగిపోయిన తుప్పలు

ఎలమంచిలి, మార్చి 24:

ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిన ఎలమంచిలిలోని రాజీవ్ గాంధీ క్రీడా మైదానం నిర్వహణను అధికారులు, పాలకులు పూర్తిగా గాలికొదిలేశారు. సగానికి పైగా మైదానంలో తుప్పలు పెరిగిపోయాయి. డ్రైనేజీ కాలువలు పూడుకుపోయాయి. వర్షం పడితే మైదానంలో నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్నది. క్రీడాకారుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు ఎప్పుడో మూలకు చేరింది. చీకటిపడితే చాలు క్రీడా మైదానం మందుబాబులకు ఆవాసంగా మారుతున్నది.



పూడికతో నిండిన డ్రైనేజీ కాలువ

ఎలమంచిలిలో సుమారు 125 సంవత్సరాల క్రితం ఐదు ఎకరాల విస్తీర్ణంలో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులు, విద్యార్థులు ఇక్కడ పలు క్రీడల్లో తర్ఫీదు పొందే వారు. ముఖ్యంగా హాకీ క్రీడకు ఎలమంచిలి పుట్టినిల్లుగా గుర్తింపు పొందడానికి విశాలమైన ఈ మైదానమే కారణం. ఈ క్రీడా మైదానం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల మధ్యలో ఉండడంతో కళాశాలల విద్యార్థులతోపాటు పాఠశాలల విద్యార్థులు, యువకులు నిత్యం హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, కబడ్డీతో పాటు అథ్లెటిక్స్‌లో తర్ఫీదు పొందుతుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం క్రీడాకారులతో కళకళలాడుతూ ఉంటుంది. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో పలువురు క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొని సత్తాచాటుతున్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నగిరెడ్డి సూర్యారావుతో పాటు ఎంతో మంది క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు పొందారు. మరోవైపు ఈ మైదానంలో ఏటా రాష్ట్రస్థాయి టోర్నమెంటులు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో 2004వ సంవత్సరంలో సుమారు 40 లక్షల రూపాయలతో క్రీడా మైదానాన్ని ఆధునీకరించి 'రాజీవ్ గాంధీ స్పోర్ట్సు కాంప్లెక్సు' పేరు మార్చారు. కొంతకాలం వరకు బాగానే నిర్వహించారు. కానీ తరువాత నిధుల కొరత, పాలకులు పట్టించుకోకపోవడంతో సమస్యలు మొదలయ్యాయి. మైదానం లోపలవైపు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. మైదానంలో నుంచి వర్షం నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దీంతో కొద్దిపాటి వర్షం కురిసినా మైదానంలో నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తున్నది. క్రీడాకారుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చేతి బోరు మూలకు చేరింది. తుప్పలు పెరిగిపోవడంతో పగలు సామాజిక మరుగుదొడ్డిగా మారిపోతున్నది. చీకటి పడిన తరవాత మందుబాబులు ఓపెన్ బార్‌గా వినియోగిస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఎలమంచిలి క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని క్రీడాకారులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.





బాస్కెట్‌బాల్ కోర్టు పక్కన ఖాళీ మద్యం సీసాలు (ఇన్‌సెట్‌లో) హెడ్ లేని తాగునీటి బోరు

నెలల తర'బడి' ఇంతే..!!

మాకవరపాలెం, మార్చి 24:

'నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశాం. విద్యారంగంలో నూతన ఒరవడిని సృష్టించేశాం' ఇదీ గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, అధికార పార్టీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు సమావేశాల్లోనూ, బహిరంగ సభల్లోనూ తరచూ చేసే ప్రసంగాలు. అయితే చాలాచోట్ల వీరు చెప్పే మాటలకు, క్షేత్ర స్థాయిలో జరిగే పనులకు పొంతన లేదని ఆయా గ్రామాల ప్రజలే వేలెత్తి చూపుతున్నారు. ఇందుకు మాకవరపాలెం మండలంలోని పలు పాఠశాలల్లో పనులను ఉదహరిస్తున్నారు.

మూడు పాఠశాలల్లో రెండేళ్ల క్రితం 'నాడు- నేడు' పనులు ప్రారంభం

- **మధ్యలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు**
- **ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**
- **పట్టించుకోని విద్యాశాఖ అధికారులు**



వజ్రగడ హైస్కూల్‌లో మెండి గోడలతో దర్శనమిస్తున్న భవనం

మండలంలోని వజ్రగడ, గిడుతూరు, జి.కోడూరు గ్రామాల్లోని మూడు హైస్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు నాడు- నేడు పథకంలో భాగంగా సుమారు కోటి రూపాయలతో నిర్మాణాలను ప్రారంభించారు. ఆయా పనులు చేపట్టేవారు ముందుగా మెటీరియల్ కొనుగోలు చేసి, బిల్లులు అప్‌లోడ్ చేస్తే ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. ఇక్కడ పనులను ప్రారంభించేకాంట్రాక్టర్లు ఆ ప్రకారం నిధులు పొందారు. కానీ రెండేళ్లుగా ఈ హైస్కూళ్లలో భవన నిర్మాణ పనులు ఆ స్థాయిలో ముందుకు సాగలేదు. నేటికీ ఈ మూడు హైస్కూళ్లలో పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.



గిడుతూరు హైస్కూల్‌లో శ్లాబ్‌కు సిద్ధం చేసి నిలిపివేసిన పనులు

వజ్రగడ హైస్కూల్‌లో ప్రస్తుతం ఉన్న భవనంపైన రెండు గదులకుగాను సుమారు రూ.30,85,517లతో పనులు ప్రారంభించారు. బిల్లు కూడా రూ.30,77,752 అప్‌లోడ్ చేశారు. అయితే రెండేళ్ల నుంచి హైస్కూల్ ఆవరణలోనే భవన నిర్మాణ సామగ్రి పడిఉంది తప్ప, పనులు వేగవంతం కాలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, గిడుతూరు హైస్కూల్‌లో ఒక భవనం నిర్మాణానికి రూ.17,66,922తో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రూ.13,17,609 బిల్లులు అప్‌లోడు చేశారు. అయితే నేటికీ పనులు పూర్తికాక పోడంతో మిగిలిన నాలుగు లక్షల రూపాయలను ప్రభుత్వం వెనక్కి తీసుకుందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా జి.కోడూరు హైస్కూల్‌లో నూతన భవనాల నిర్మాణానికి రూ.31,70,412తో పనులు ప్రారంభించారు. ఇంత వరకూ రూ.28,45,341 బిల్లులు అప్‌లోడు చేశారు. మిగిలిన పనులు చేయకపోవడంతో మూడు లక్షల రూపాయలను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దీనికి తోడు కోడూరు హైస్కూల్‌లో సిమెంట్ బస్తాలు కూడా గడ్డ గట్టి ఉన్నాయి. వీటిని అధికారులు పట్టించుకోలేదు. ఈ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం వహిస్తున్నా మండల విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలల్లో అదనపు భవనాలు నిర్మిస్తే సౌకర్యవంతంగా ఉంటాయని ఇటు విద్యార్థులు, అటు వారి తల్లిదండ్రులు సంబరపడినా వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. కనీసం రానున్న కొత్త విద్యా సంవత్సరం ఆరంభం నాటికైనా నిర్మాణ పనులు పూర్తిచేసి ఆయా భవనాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని అంతా కోరుతున్నారు. దీనిపై ఎంఈవో-2 మూర్తిని వివరణ కోరగా, గిడుతూరు, జి.కోడూరు హైస్కూళ్లలో నిర్మాణాలకు నిధుల కొరత ఉందన్నారు. వజ్రగడ హైస్కూల్ భవ నిర్మాణాలు చేసేందుకు అక్కడున్న కమిటీ ముందుకు రాకపోవడతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు.



వజ్రగడ పాఠశాల ఆవరణలో వృథాగా పడి ఉన్న మెటీరియల్

క్రైం... crime news

కోడి పందాల శిబిరంపై దాడి : ఐదుగురి అరెస్టు

- రెండు పందెం కోళ్లు, రూ. 1,230 నగదు స్వాధీనం

ఎస్. రాయవరం, మార్చి 24: మండలంలోని కోనవానిపాలెం గ్రామ శివారులో ఉన్న చెరువు వద్ద నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆదివారం దాడులు నిర్వహించి, ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఈ సందర్భంగా రెండు పందెం కోళ్లు, రూ 1,230 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. కోడి పందాలు జరుగుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. పట్టుబడిన వ్యక్తులపై కేసు నమోదుచేసి, కోళ్లు, నగదును సీజ్ చేశామన్నారు.

నలుగురి అరెస్టు...

అచ్యుతాపురం, మార్చి 24: ఎర్రవరంలో కోడిపందెలు నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఎర్రవరం కొండపక్కన కోడి పందెలు జరుగుతున్నాయని అందిన సమాచారం మేరకు దాడి చేసి మూడు కోడి పుంజులు, రూ.15వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఎర్రవరం కొండ వద్ద గుట్టు చప్పుడు కాకుండా ప్రతి ఆదివారం కోడిపందాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. పార్టీలకతీతంగా నాయకులు కోడి పందెలు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు.

12 మద్యం సీసాలతో ఒకరిపై కేసు నమోదు

ఎలమంచిలి, మార్చి 24: స్థానిక పీటీడీ బస్టాండ్ సమీపంలో 12 మద్యం సీసాలతో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. కట్టుపాలెం గ్రామానికి చెందిన పి.రాంబాబు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కుంచంగిలో 9 మద్యం సీసాలతో మహిళపై..

కొత్తూరు, మార్చి 24: అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని అనకాపల్లి రూరల్ స్టేషన్ ఏఎస్ఐ సింగంపల్లి భాస్కరరావు తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆదివారం కుంచంగి గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన జామి నాగమణిని తనిఖీ చేయగా 9 మద్యం క్వార్టర్ సీసాలు లభ్యమయ్యాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

12 మద్యం సీసాలతో మరొకరిపై..

అనకాపల్లి టౌన్, మార్చి 24 : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ వద్ద అనకాపల్లిలో మద్యం కొనుగోలు చేసి తీసుకువెళ్తున్న వ్యక్తి నుంచి 12 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నామని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీను తెలిపారు. రాయుడుపేటకు చెందిన కొలుసు లక్ష్మణరావు పట్టణంలోని మద్యం దుకాణాల నుంచి మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి సంచిలో తీసుకువెళుతుండగా తనిఖీ చేశామని, ఈ సందర్భంగా 12 మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని శ్రీను తెలిపారు.

కొత్త అమావాస్య జాతర చాటింపు ప్రారంభం

అనకాపల్లి టౌన్, మార్చి 24: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక కొత్త అమావాస్య జాతర చాటింపు ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ముందుగా బాలాలయంలో ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగ చాటింపు పట్టణ వీధుల గుండా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



కొత్తఅమావాస్య జాతర చాటింపు ప్రారంభించిన దృశ్యం

వైభవంగా అనంతుని రథోత్సవం

- **వేలాదిగా పాల్గొన్న భక్తులు**
- **ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

పద్మనాభం, మార్చి 24: పద్మనాభంలోని అనంత పద్మనాభుని రథోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఏటా ఫాల్గుణ ఏకాదశి నుంచి జరిగే అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా చతుర్థశితో కూడిన పౌర్ణమి రోజున రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఉత్సవంలో భాగంగా ముందుగా నిత్య హోమం, రథాంగ హోమం, మహాశాంతి హోమం, గ్రామ బలిహరణ అనంతరం వైదిక సదస్సు నిర్వహించారు. సాయంత్రం కృష్ణాపురం, మద్ది, పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకుని పాలెం గ్రామాలకు చెందిన ముఖ్య కుటుంబీకులు రథాన్ని ఊరేగించడానికి తీసుకువచ్చిన తాళ్లను రథానికి కట్టి, రథ చక్రాలకు పూజలు నిర్వహించి, ఊరేగింపునకు సిద్ధం చేశారు. ఉత్సవానికి ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కుంతీమాధవస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. లక్ష్మీ సన్నిధి సమీపంలో మహిళలు దీపాలంకరణ చేశారు. అనంతరం వేద పండితుల వేద పఠనం, విశేష పూజలు తరువాత శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చారణలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై నిలిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పద్మనాభం పోలీసు స్టేషన్ సీఐ శ్రీధర్‌ను దేవస్థానం ఈఓ నానాజీబాబు ఆధ్వర్యంలో ఆహ్వానించి ప్రథమ పూజ నిర్వహించారు. రథోత్సవంలో ప్రధాన భాగస్వాములైన సుంకర, సురాల, మొకర, కనకల, తాలాడ కుటుంబాలకు చెందిన వారితో పూజలు చేయించారు. భక్తులందరూ గోవింద నామస్మరణతో మార్మోగగా రథాన్ని పద్మనాభంలోని రాజవీధి మీదుగా ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. తిరువీధిలో దారి పొడవునా భక్తుల నీరాజనాల నడుమ అనంతుడు ప్రత్యేక పూజలు అందుకున్నారు. అర్ధ రాత్రి దాటిన తరువాత రథం తిరిగి ఆలయం వద్దకు చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. రథోత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే త్రి రత్నాలు పేరుతో పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేడు అప్పన్న డోలోత్సవం

సింహాచలం, మార్చి 24: వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జరిగే వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం డోలోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉదయం 6.30 గంటలకు మెట్ల మార్గంలో పల్లకీలో బోయిలు కొండ దిగువకు తీసుకు వస్తారు. తొలిపావంచా వద్ద గ్రామస్తులు, భక్తుల స్వాగతం తరువాత స్వామివారు నేరుగా అడివివరం గ్రామ దేవత, సోదరి పైడితల్లెమ్మ ఆలయానికి చేరుకుంటారు. అక్కడ అమ్మవారికి పసుపు కుంకుమలిచ్చి తనకు ఆమె కుమార్తె శ్రీ మహాలక్ష్మీ అమ్మవారితో వివాహానికి సంబంధం కుర్చుకుంటారు. అక్కడి నుంచి పురాతన ఉద్యానవన మండపానికి చేరుకుని డోలోత్సవం జరుపుకుంటారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం చేసుకుని కొండ దిగువ మాడవీధుల్లో తిరువీధి అనంతరం తిరిగి మెట్ల మార్గంలో సింహగిరికి చేరుకోవడంతో డోలోత్సవం పూర్తవుతుంది. కాగా గ్రామీణ ఆచారం ప్రకారం పైడితల్లెమ్మ కుమార్తెతో వివాహానికి స్వామి మాటాలకు వస్తాడని అందుకే ఈ ఉత్సవాన్ని బొట్టెన దుగు పున్నమిగా స్థానికులు వ్యవహరిస్తారు.



ముస్తాబైన ఉద్యానవన మండపం

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

రాజాధిరాజ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు

నక్కపల్లి, మార్చి 24: మండలంలోని ఉపమాక క్షేత్రంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రాజాధిరాజ వాహనంపై స్వామివారి తిరువీధి సేవ, తోట ఉత్సవం జరిగింది. ఆలయానికి 2 కిలోమీటర్ల దూరంలో సీహెచ్ఎల్‌పురం వద్ద వున్న స్వామివారి తోటకు రాజాధిరాజ వాహనంపై స్వామివారిని అలంకరించి తీసుకెళ్లారు. అక్కడ వున్న రాతి కల్యాణ మండపంపై పూజా కార్యక్రమాలు చేసి, ప్రసాదాలు పంపిణీ చేశారు. తదుపరి రాత్రి మాడవీధుల్లో తిరువీధి సేవ జరిగింది. ఆదివారం కూడా ఉపమాక వెంకన్న ఆలయాన్ని రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో వున్న క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన పండిత సభ విశేషంగా అలరించింది. తోట ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నందూరి రాజగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు.



రాజాధిరాజ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడిని తోట ఉత్సవానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

నూకాంబిక అమ్మవారి పునఃదర్శనం ప్రారంభం

అనకాపల్లి టౌన్, మార్చి 24: స్థానిక నూకాంబిక అమ్మవారి పునఃదర్శనం ఆదివారం ప్రారంభమైంది. కొత్త అమావాస్య జాతర సందర్భంగా అమ్మవారి విగ్రహానికి రంగులు వేసే కార్యక్రమంలో భాగంగా గురు, శుక్ర, శనివారాల్లో దర్శనాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో కుటుంబసమేతంగా వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు టీడీపీలో చేరిక

- కండువా కప్పి ఆహ్వానించిన చంద్రబాబు

కె.కోటపాడు, మార్చి 24: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో అతనితోపాటు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నక్కలి నాగమణికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాల్తేటి పెంటారావు స్వగ్రామం మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలం రామయోగి అగ్రహారం. విద్యార్థి దశ నుంచే దళితుల హక్కుల కోసం పోరాడుతున్నారు. దళిత ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గతంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేశారు. అప్పట్లో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. పదవీ విరమణ తరువాత మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు కూడా పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పాల్తేటి పెంటారావు, పక్కన రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు

రాంకీ పైపులైన్ పనులను నిలిపివేయాలని తాడి గ్రామస్థుల ఆందోళన

పరవాడ, మార్చి 24: రాంకీ యాజమాన్యం ఫార్మా గ్రీన్‌బెల్ట్ స్థలంలోంచి అక్రమంగా చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను తక్షణమే నిలిపివేయాలని ఆదివారం స్థానిక ఆలయం వద్ద తాడి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికే ఫార్మా కాలుష్యంతో అల్లాడిపోతున్నామని, ఇటువంటి తరుణంలో చెట్లను తొలగించి పైపులైన్ పనులను ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. ఫార్మా కాలుష్య కోరల్లోంచి గ్రామాన్ని తక్షణమే తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, మాజీసర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, స్థానిక నాయకులు గనిరెడ్డి కనకరాజు, మాధవరావు, కోమటి కులదీప్‌రాజ్, మాదంశెట్టి సూరిబాబు, కోమటి అచ్చిబాబు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్**



సిబ్బందికి సలహాలు, సూచనలిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్

పరవాడ, మార్చి 24: ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ ఆదేశించారు. ఆదివారం అయన దేశపాత్రునిపాలెం పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది, కేంద్ర పోలీస్ బలగాలు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమ రవాణా అరికట్టేందుకు డబ్బు, మద్యం, నాటుసారా, గంజాయి, ఉచిత కానుకలు పంపిణీని నిరోధించేందుకు పటిష్ఠ తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈయన వెంట పరవాడ సీఐ బాలసూర్యారావు ఉన్నారు.

సెజ్ పరిశ్రమల్లో బైక్ దొంగలు

- **కంపెనీల పార్కింగ్ ప్లేస్‌లో పెట్టిన వాహనం చోరీ**
- **పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని బాధితుడి ఆవేదన**

అచ్యుతాపురం రూరల్, మార్చి 24 : అచ్యుతాపురం, రాంబిల్లి పరిధిలోని సెజ్ కంపెనీలలో బైక్‌లు దొంగతనం జరుగుతున్నాయి. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడంతో దొంగలు చెలరేగిపోతున్నారు. కంపెనీల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లకు రక్షణ లేకుండా పోతున్నది.

రాంబిల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని వసంత కెమికల్స్ కంపెనీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అచ్యుతాపురంకు చెందిన మందపల్లి సురేష్ బైక్‌ను పార్క్ చేసి నైట్ డ్యూటీకి లోపలికి వెళ్లాడు. ఉదయాన్నే తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించకపోవడం, మరో మూడు బైక్‌ల హ్యాండిల్స్ వంకరపోవడంతో కంపెనీ యాజమాన్యానికి తెలియజేశాడు. కంపెనీ సీసీ కెమెరాను పరిశీలించగా.. ఇద్దరు గుర్తు తెలియని యువకులు రాత్రి సమయంలో కంపెనీ పార్కింగ్‌లోకి ప్రవేశించారు. మధ్యలో పెద్ద కాలువ ఉండడంతో సెక్యూరిటీ గేటు పక్క నుంచి దర్జాగా ఒకడు బైక్ పార్కింగ్‌లో వెళ్లి మూడు బైక్‌ల లాక్‌లను విరగగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. చివరగా సురేష్‌కు చెందిన బైక్‌ను సునాయాసంగా విరగగొట్టి తోసుకుంటూ తీసుకు వెళ్లిపోయాడు. సెక్యూరిటీ సిబ్బంది అక్కడ లేకపోవడంతో వారి దొంగతనం సులభమైంది. ఉదయాన్నే సీసీ కెమెరా క్లిప్పింగ్‌తో సురేష్ రాంబిల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. రిసిప్టు ఇవ్వాలని ఎంత కోరినా కంపెనీ వద్దకు వచ్చి ఇన్వెస్టిగేషన్ చేసిన తర్వాత ఇస్తామని పోలీసులు చెప్పి పంపించేశారు. అప్పటి నుంచీ ప్రతీరోజూ పోలీసు స్టేషన్‌కు వెళ్లడం.. ఏదో చెప్పి పోలీసులు పంపించి వేయడం జరుగుతోంది. పోలీసుల చర్యలతో విసిగిపోయిన సురేష్ గత సోమవారం అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో జరిగే స్పందనలో ఫిర్యాదు చేయడానికి వెళ్లాడు. స్పందన తీసేశామని, ఫిర్యాదులు స్వీకరించడం లేదని తిరిగి పంపించేశారు. పోలీసులు పట్టించుకోకపోతే దొంగలు ఇష్టారాజ్యంగా మారిపోతారనే ఆందోళన చెందే పరిస్థితి నెలకొంది. బైక్‌ను దొంగలు నడిపించుకుంటూ వెళ్లిపోవడంతో సమీప ప్రాంతంలోనే బైక్ ఉన్నట్టు అనుమానిస్తున్నాడు. పోలీసులు దృష్టి సారిస్తే బైక్ దొరుకుతుందని బాధితుడు సురేష్ అంటున్నాడు. దొంగతనం జరిగి 20 రోజులైనా ఇంకా తమ కంపెనీకి వచ్చి ఎంక్వయిరీ జరపలేదు సరికదా.. తన ఫిర్యాదుకు రిసిప్టు ఇవ్వకపోవడంపై సురేష్ అసహనం వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయమై రాంబిల్లి సర్కిల్ సీఐ లక్ష్మణరావును వివరణ కోరగా.. బైక్ అపహరణ సంఘటనపై క్రైమ్ టీమ్‌కు సమాచారం ఇచ్చామన్నారు. ఇప్పటికే వసంత కెమికల్ కంపెనీకి రెండు సార్లు వెళ్లి, సీసీ కెమెరాలను పర్యవేక్షించి ప్రాథమిక సమాచారం తెలుసుకున్నట్టు తెలిపారు. త్వరలో బైక్ దొంగలను పట్టుకుంటామన్నారు. ఆయా కంపెనీల పరిసరాలలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.



వసంత కెమికల్ సెక్యూరిటీ పక్కనే ఉన్న బైక్ స్టాండ్

ఆ యువకుడిపై చర్యలు తీసుకోండి

- **పోలీసులకు ఫిర్యాదు చేసిన ధర్మవరం అగ్రహారం పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్**
- **ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**

ఎస్. రాయవరం, మార్చి 24: మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి పరీక్ష కేంద్రం ప్రహరీ గోడ దూకి ప్రవేశించిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్. రాయవరం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసినట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం టెన్త్ పరీక్షా కేంద్రం వద్ద హల్‌చల్ శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. దీనికి సంబంధించి పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గోడ దూకి పరీక్షా కేంద్రం వద్దకు స్లిప్పుతో వచ్చిన యువకుడు ఎవరనేది గుర్తించి, చర్యలు తీసుకోవాలని, అలాగే పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు పెంచాలని కోరినట్టు చెప్పారు.

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

- **జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ బాలాజీ**

అనకాపల్లి టౌన్, మార్చి 24 : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎంపీఎస్ బాలాజీ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా డీఎల్‌వో కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చికిత్సతో క్షయవ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. వారం రోజుల పైబడి దగ్గుతో బాధపడుతున్న వారు పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీని డాక్టర్ బాలాజీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ బాలాజీ

సంపద కేంద్రాల నిర్వహణపై కదిలిన పంచాయతీ కార్యదర్శులు

కోటవురట్ల, మార్చి 24: మండలంలో గొట్టివాడ, జగ్గంపేట గ్రామాల్లో సంపద కేంద్రాలు నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు స్పందించారు. మండలంలో సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ గాలికొదిలేసిన అధికారుల నిర్లక్ష్యంపై ఈనెల 21వ తేదీన 'చెత్త శుద్ధి లేదాయె' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై డీపీవో శిరీషారాణి, ఈవోపీఆర్డీ స్వామినాయుడు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు గొట్టివాడ పంచాయతీలో రోడ్డుపక్కన చెత్తను ఎక్స్‌కవేటర్‌తో తొలగించగా.. టి. జగ్గంపేట సంపద కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శులు వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్టు



జగ్గంపేట సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తున్న కార్యదర్శి

మండల కాంప్లెక్స్‌లో ప్రైవేటు షాపు తొలగింపు

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్టు

పాయకరావుపేట, మార్చి 24 : స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలో అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన ప్రైవేటు షాపును ఆదివారం అధికారులు తొలగించారు. మండల కాంప్లెక్స్ ఆవరణలోని ప్రభుత్వ స్థలంలో అనుమతుల్లేకుండా ఒక వ్యక్తి ప్రైవేటు షాపు నిర్వహిస్తుండడంపై ఆదివారం 'మండల కాంప్లెక్స్‌లో ప్రైవేటు షాపు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి ఆదివారం షాపును తొలగించారు.

చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

అనకాపల్లి టౌన్, మార్చి 24 : స్థానిక చౌడేశ్వరి దేవాంగ కల్యాణ మండపంలో స్థానిక చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ నూతన కమిటీ అధ్యక్షులుగా రెడ్డి వరప్రసాద్, కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా ముప్పన లింగేశ్వరరావు, సహాయ కార్యదర్శిలుగా బానిన బాల గురూజీ, వేమన సంతోష్, కోశాధికారి ముప్పన వాసు, ప్రచార కమిటీ సభ్యులు బల్లా నాగభూషణం, కార్యవర్గసభ్యులు, గౌరవ సలహాదారులు ప్రమాణ స్వీకారం చేశారు.

రోటరీ హాల్‌లో ఉచిత వైద్య పరీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 24 : స్థానిక రోటరీ కల్యాణ మండపంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో, డెంటల్ వైద్యశిబిరం జరిగింది. ప్రతీ ఆదివారం ఉచిత హోమియో, డెంటల్ వైద్యశిబిరం నిర్వహిస్తామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు పీజే నాయుడు అన్నారు. హోమియో వైద్యులు విల్లూరి జోగినాయుడు, కృష్ణమూర్తితో పాటు డెంటల్ వైద్యులు సంజన రోగులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆదారి రామకృష్ణ, రాపేటి నారాయణరావు పాల్గొన్నారు.

కొణతాలకు ప్రభాస్ అభిమానుల మద్దతు

అనకాపల్లి టౌన్, మార్చి 24: పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు కాండ్రేగుల జోగేంద్ర, గోవింద బ్రదర్స్ మిత్రమండలి అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మద్దతు ప్రకటించారు. ఆదివారం స్థానిక గవరపాలెం పార్కు సెంటర్ వద్ద జరిగిన ఆత్మీయ సమావేశంలో 200 మంది యువకులు జనసేన పార్టీలో చేరడానికి నిర్ణయించుకున్నారు. త్వరలోనే కొణతాల రామకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలో చేరుతామని జోగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో దాడి త్రినాథ్, కాండ్రేగుల సునీల్, వి.బాలు, కె.రాజేష్, సత్యదేవ్, లోవకుమార్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 86 మందికి పరీక్షలు

కోటవురట్ల, మార్చి 24: స్థానిక ప్రైవేటు స్కూల్ వద్ద జిల్లా అంధత్వనివారణ సంస్థ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 86 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 30 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ పాపాసాహెబ్, ఆప్తలమిక్ ఆఫీసరు సురేష్, కో-ఆర్డినేటర్ సీహెచ్ అశ్వనికుమార్ పాల్గొన్నారు.

విస్తృతంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

పాయకరావుపేట రూరల్, మార్చి24: ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మండలంలో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాలలో పార్టీలకు సంబంధించిన బ్యానర్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించారు. ఆదివారం సత్యవరం, పెదరాంభద్రపురం మధ్య డెక్కన్ రోడ్డులో వ్యాన్‌లు, కార్లను ఆపి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

రామాపురం కాలనీలో జనసేన ప్రచారం



రామాపురంలో ప్రచారం ప్రారంభిస్తున్న జనసేన నాయకులు

కొత్తూరు, మార్చి 24: అనకాపల్లి మండలం కొత్తూరులోని రామాపురం కాలనీలో జనసేన పార్టీ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. గ్రామంలోని నల్లమారమ్మ ఆలయం వద్ద నుంచి జనసేన పార్టీ నాయకులు కొణతాల బాలబాబు ప్రచారం ప్రారంభించారు. జనసేన అనకాపల్లి అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ యూత్ ప్రెసిడెంట్ జ్యోతుల గణేష్, టీడీపీ బీసీ సెల్ కన్వీనర్ కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌జీపాలెంలో కూటమి కార్యకర్తలు ప్రచారం

కశింకోట, మార్చి 24: మండలంలోని నూతనగుంట పాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు గాజు గ్లాస్‌పై ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నాయకులు ఎలమంచిలి వెంకట్రావు, సంజీవ్, జనసేన పార్టీ నాయకులు సింహాద్రి, సిరసపల్లి శ్రీను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల కార్యకర్తలు చిన్నోడు, సూరిబాబు, తాతారావు, దండిన శ్రీను, బాషా, దుర్గ, నేహంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



కోటవురట్లలో ఈత మట్టలతో చిన్నారులు

తుమ్మపాల/ సబ్బవరం/ కశింకోట/ కోటవురట్ల/ పాయకరావుపేట, మార్చి 24: జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం వేడుకలు నిర్వహించారు. అనకాపల్లి పట్టణంతో పాటు మండలంలో ర్యాలీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇమ్మానుయేల్ ప్రేయర్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు పాస్టర్ సీహెచ్.రాజు, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు. సబ్బవరంలో రోమన్ కేథలిక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ప్యారిస్ ప్రీస్ట్ థామస్ పులికల్, విశాఖ ఆటోనగర్‌కు చెందిన ఫాదర్ జోషెఫ్, మడక పుష్పలత, ఆదారి నాగరాజు పాల్గొన్నారు. కశింకోట గవరపేట వీధిలో యేసుక్రీస్తు ప్రార్థన మందిరం నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ వై.సునీల్‌బాబు, అధ్యక్షుడు కె.శ్యామలరాజు, సంఘ సభ్యులు మధుసూదన్, కృపావరం, జాన్‌మార్క్ తదితరులు పాల్గొన్నారు. కోటవురట్ల మండలంలో పలుగ్రామాల్లో క్రైస్తవులు ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేకేబీ చర్చి అధ్యక్షకార్యదర్శులు ఆర్.ప్రసన్నకుమార్, మట్ల ఆనందరాజు, ఎస్. సంగీతరాజ్, బి. రాజేంద్రప్రసాద్, జి.ఆనందగంగభవానీ, తదితరులు పాల్గొన్నారు. పాయకరావుపేట ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జయప్రసాద్, మరియన్న, జాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అందరు సుఖశాంతులతో మెలగాలంటూ క్రీస్తు సందేశం వినిపించారు.

చేనేత కుటుంబం మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మునగపాక (తుమ్మపాల), మార్చి 24 : ఒంటిమెట్ట మండలానికి చెందిన చేనేత కుటుంబం మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఒంటిమెట్ట పరిధిలోని హైవేకి ఆనుకుని చేనేత కుటుంబానికి చెందిన 3.10 ఎకరాల భూమి వైసీపీ నేత అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకోవడంతో తట్టుకోలేని ఆ కుటుంబం ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటకోట విజయ్, దొడ్డి రమేష్, మళ్ల నరసింగరావు, కాండ్రేగుల శంకర్ పాల్గొన్నారు.

కల్తీ మద్యం అమ్ముతున్న ఏకైక సీఎం జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల పెదబాబు ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

కశింకోట, మార్చి 24: దేశంలో కల్తీ మద్యం అమ్ముతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) ఆరోపించారు. ఆదివారం మండలంలోని కన్నూరుపాలెంలో ఉన్న పంచ గ్రామాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనకాపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా, బీజేపీ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీని గెలిపించుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ కాండ్రపు రామునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నాయి.

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

» జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ



జనసేనలో చేరిన వారితో టీడీపీ, జనసేన నాయకులు

తుమ్మపాల, మార్చి 24 : రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం తుమ్మపాలలో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అవినీతి భారీగా పెరిగిపోయిందన్నారు. వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులను అటకెక్కించారన్నారు. పూర్తి మద్యపాన నిషేధం చేసి ఓట్లు అడిగేందుకు మీ ముందుకు వస్తానని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. అనంతరం వైసీపీ యువజన విభాగం నాయకుడు బొడ్డపాటి రామ్‌కుమార్, జిల్లా టెలికాం మెంబర్ పీలా విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటసూరి, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డపాటి శ్రీనివాసరావుతోపాటు సుమారు 50 మంది కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. వారికి కొణతాల రామకృష్ణ పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న కొణతాల

తుమ్మపాల పంచాయతీ పరిధి వాటర్‌వర్క్సు ప్రాంతంలో గల కనకదుర్గమ్మ అమ్మవారిని జనసేన అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలను చేపట్టారు.

టీడీపీలో చేరిన నునపర్తి వైసీపీ శ్రేణులు

» సాదరంగా ఆహ్వానించిన పప్పల, ప్రగడ



టీడీపీలో చేరిన వారితో పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మార్చి 24: మండలంలోని నునపర్తి పంచాయతీలో వైసీపీ నాయకులు ఆదివారం టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నునపర్తి మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు రెడ్డి సన్యాసినాయుడు ఇంటి వద్ద జరిగిన పార్టీ సమావేశంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెన్నెల అప్పలనాయుడు, అచ్యుతాపురం మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు, వార్డు మెంబర్లు ఎదురమ్మ, వెన్నెల శ్రీను, గెడ్డం నూకరాజు, ఎస్.అచ్చయ్యనాయుడు, రమేష్‌లతోపాటు 500 మంది ఆదివారం టీడీపీలో చేరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, మండల అధ్యక్షుడు జనపరెడ్డి నరసింగరావు, నాయకులు నానాజీ, మేరుగు బాపునాయుడు, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా అనిత జన్మదిన వేడుకలు



అనితను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, మార్చి 24: తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత జన్మదిన వేడుకలను నియోజకవర్గ టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అనిత నివాసానికి వెళ్లి నాలుగు మండలాల నాయకులు ఆమెను గజమాలతో సత్కరించారు. అనంతరం అనిత కేక్‌ను కట్ చేశారు. అనితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంటి అబద్దం, పెదిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ, పెదిరెడ్డి శ్రీను, విలియం కేరీ, జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ ఉన్నారు. ఆదివారం ఉదయం అనిత ఉపమాక వెంకన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు కొప్పిశెట్టి కొండబాబు, ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి శ్రీను ఘనస్వాగతం పలికారు.

పాయకరావుపేటలో.. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత బర్త్ డే వేడుకలు ఆదివారం పాయకరావుపేటలో ఘనంగా జరిగాయి. అనిత బర్త్ డే కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు వి.అనితకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్డి నాగవెంకటరమణ(పండు), ఎం.రమాకుమారి, వేములపూడి అప్పారావు, సీహెచ్.పేర్రా పాల్గొన్నారు. అలాగే స్థానిక పీహెచ్‌సీలో టీడీపీ నాయకులు గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, యాళ్ల వరహాలబాబు, దేవవరపు వెంకట్రావు, నీలాపు మహేశ్‌రెడ్డి, రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు తథ్యం : సుందరపు



విజయకుమార్ సమక్షంలో జనసేనలో చేరిన కొత్తపేట వైసీపీ శ్రేణులు

మునగపాక (తుమ్మపాల), మార్చి 24 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గత ఐదేళ్లలో అభివృద్ధి జరగలేదన్నారు. దోచుకోవడం... దాచుకోవడం తప్ప ఎమ్మెల్యేకు మరో ఆలోచన లేదన్నారు. అనంతరం వైసీపీ మునగపాక మండల ఉపాధ్యక్షుడు అల్లవరపు రమణబాబుతోపాటు పలువురు కార్యకర్తలు సుందరపు విజయ్‌కుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో జనసేన నేతలు టెక్కలి పరుశురాం, పైలా రామునాయుడు, బైలంపూడి రామదాసు, కాళ్ల చంద్రమోహన్, మొల్లేటి ఆనంద్, ఆదారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సుందరపు సమక్షంలో జనసేనలో చేరికలు

రాంబిల్లి, మార్చి 24 : మండలంలోని హరిపురం లోని జనసేన కార్యాలయంలో ఆదివారం కొత్తపేట ఉపసర్పంచ్ కడగల పైడిరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలి భర్త ధర్మాల పైడిరాజుల ఆధ్వర్యంలో సుమారు 80 మంది వైసీపీ శ్రేణులు పార్టీలో చేరారు. వీరందరికి జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలమంచిలి నియోజకవర్గంలో జనసేన, టీడీపీ, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసిన వైసీపీకి సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, ద్వారపురెడ్డి బాబ్జి, చోడిపల్లి ప్రసాద్, గంగరాజు, వురిటి నారాజీ, ఎరిపల్లి నాగరాజు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో ప్రభుత్వాలు విఫలం'

తుమ్మపాల, మార్చి 24 : రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో ప్రభుత్వాలు ఇప్పటివరకు విఫలమవుతూ వస్తున్నాయని జైభారత్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కనిశెట్టి సురేష్‌బాబు ఆరోపించారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఎన్టీఆర్ వైద్యాలయం అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల నిర్వాకాలతో రిఫరల్ ఆస్పత్రిగా మారిపోయిందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే ఆర్‌ఈసీఎస్ సేవలను ఈపీడీసీఎల్‌లో కలిపేయడం దారుణమన్నారు.

తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని మూసేయడం దారుణమన్నారు. జై భారత్ పార్టీ శ్రేణులంతా ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధమని ఆయన స్పష్టంచేశారు. తొలుత నెహ్రూచౌక్‌లో నాయకులంతా మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జైభారత్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కింజరాపు జయదేవ్, పార్లమెంట్ కో-ఆర్డినేటర్ ఆదారి శరత్‌చంద్ర, న్యాయవాది శేఖరమంత్రి సాయి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఎంపీ అభ్యర్థి ఖరారు

... 5వ పేజీ తరువాయి

పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపునందుకొని టీడీపీలో చేరారు. టీడీపీ చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శిగా, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిగా పని చేశారు. తరువాత టీడీపీ కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2009లో టీడీపీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ తరపున 2012లో రాజ్యసభ సభ్యుడి ఎన్నికయ్యారు. ఇదే సంవత్సరం కడప జిల్లాలో విద్యుత్ కోతలు, సాగునీరు, తాగునీరు సమస్యలు, సిమెంట్ ధర తగ్గించాలని కోరుతూ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. 2018లో రెండోసారి టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గత సాధారణ ఎన్నికల తరువాత సహచర రాజ్యసభ సభ్యులు సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్‌తో కలిసి బీజేపీలో చేరారు. అప్పటి నుంచి బీజేపీలోనే కొనసాగుతున్నారు. పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడి పనిచేశారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీకే కేటాయించడంతో సీఎం రమేశ్ ఇక్కడి నుంచి పోటీ చేయడానికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం రమేశ్‌కు ఇదే తొలిసారి.

అరకులోయ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత

పాడేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత పేరు బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి జాబితాను విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి గీత పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. గ్రూప్-1 అధికారిగా సేవలందించారు. రాజకీయాల పట్ల ఆసక్తి ఉండడంతో 2013లో ఉద్యోగానికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో అరకులోయ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. 2018లో వైసీపీ అధిష్ఠానంతో విభేదాలు రావడంతో పార్టీ నుంచి బయటకు వచ్చి జనజాగృతి పేరిట రాజకీయ పార్టీని స్థాపించారు. 2019లో బీజేపీలో విలీనం చేశారు. గత ఏడాది ఆగస్టులో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. పొత్తులో భాగంగా అరకులోయ ఎంపీ సీటును బీజేపీకి కేటాయించడంతో కొత్తపల్లి గీత అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది.

అవయవదాతల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

సమ్మతి మేరకు చేయడం. 2015 నుంచి 2019 వరకు కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో భాగంగా 457 మందికి కిడ్నీ మార్పిడి, 192 మందికి లివర్, 73 మందికి హార్ట్ 92 మందికి లంగ్స్, ఒకరికి పాంక్రియాస్ మార్పిడి శస్త్రచికిత్సలను చేశా రు. లైవ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటే బతికి ఉండగానే కొన్ని అవ యవాలను దానం చేసే అవకాశముంది. కుటుంబ సభ్యులకు, దగ్గరి బంధువులకు కొన్ని అవయవాలు దానం చేయవచ్చు. దీన్ని లైవ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు. ఇందుకోసం లివర్‌లో నాలుగో వంతు, కిడ్నీలో ఒకటి, బోన్ మ్యారో వంటివి ఇవ్వవచ్చు. గడిచిన తొమ్మిదేళ్లలో లైవ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటే షన్స్ అధికంగా జరిగాయి. వీటిలో కిడ్నీ 2,498 మందికి, లివర్ 30 మందికి మార్పిడి చేశారు.

అవగాహనతోనే ముందుకు

గతంతో పోలిస్తే కెడావర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ పెరి గాయి. ప్రమాదాల్లో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి అవయవాలు అందించేందుకు ఎక్కువ మంది ముందుకు వస్తుండడంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. అవయవదానంపై స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి.

మరో రెండు సీట్లకు జనసేన అభ్యర్థులు ఖరారు

... 5వ పేజీ తరువాయి

నుంచి సుందరపు విజయకుమార్‌లకు చోటు దక్కింది. విశాఖ దక్షిణం సీటును పెండింగ్‌లో పెట్టారు.

తొలుత టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని జనసేన పార్టీ టీడీపీని కోరింది. పెందుర్తి, భీమిలి, గాజువాక, ఎలమంచిలి స్థానాలను అడిగినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో గత నెల 24వ తేదీన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తమ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాలను విడుదల చేశారు. అనూహ్యంగా అనకాపల్లి నుంచి జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పేరును ప్రకటించారు. కొద్ది రోజుల తరువాత కూటమిలో బీజేపీ చేరడంతో సమీకరణాలు మారిపోయాయి. పెందుర్తి, ఎలమంచిలితోపాటు విశాఖ దక్షిణ నియోజకవర్గాలను జనసేనకు కేటాయించినట్టు వార్తలు వచ్చాయి. అధికారికంగా ప్రకటించనప్పటికీ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్.. పెందుర్తికి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలికి సుందరపు విజయకుమార్ పేర్లను ఖరారు చేసి, ఎన్నికల ప్రచారం చేసుకోవాలని చెప్పినట్టు తెలిసింది. విశాఖ దక్షిణ నియోజకవర్గం టికెట్‌పై వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కూడా హామీ లభించింది. అయితే ఆదివారం ప్రకటించిన మలి విడత జాబితాలో పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయకుమార్ (ఎలమంచిలి)కు మాత్రమే చోటు లభించింది. దక్షిణ నియోజకవర్గం ప్రస్తావనలేకపోవడంతో వంశీకృష్ణతోపాటు జనసేన వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పంచకర్ల రమేశ్ బాబు

నగరంలో వ్యాపారం చేసుకునే పంచకర్ల రమేష్‌బాబు ప్రజారాజ్యం ఏర్పాటుతో రాజకీయాల్లో ప్రవేశించి 2009లో పెందుర్తి నుంచి అసెంబ్లీకి పోటీచేసి విజయం సాధించారు. రాష్ట్రం విడిపోయిన తరువాత 2014లో టీడీపీలో చేరి ఎలమంచిలి నుంచి విజయం సాధించారు. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచే టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. తరువాత వైసీపీలో చేరి పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ ఇమడలేక జనసేనలో చేరారు. కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకంలో భాగంగా జనసేన పార్టీకి పెందుర్తి కేటాయించడంతో పంచకర్లకు అవకాశం లభించింది.

సుందరపు విజయకుమార్

ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన సుందరపు విజయకుమార్ తెలుగుదేశం పార్టీతో రాజకీయ జీవితం ప్రారంభించారు. 2014లో ఎలమంచిలి నుంచి పోటీచేసే అవకాశం చివర్లో చేజారింది. తరువాత కొన్నాళ్లకు జనసేనలో చేరి 2019లో ఎలమంచిలి నుంచి పోటీచేసి ఓడిపోయారు. అప్పటి నుంచి పవన్‌కల్యాణ్‌కు సన్నిహితంగా ఉంటున్నారు.ఈ నేపథ్యంలో ఆయనకు అదే స్థానం నుంచి టికెట్ ఖరారైంది.

కూటమికి యువత అండగా ఉండాలి

» టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కొణతాల



కొణతాల సమక్షంలో పార్టీలో చేరిన యువకులు

అనకాపల్లి టౌన్, మార్చి 24 : భావితరాల భవిష్యత్తు కోసం యువత కూటమి పార్టీలకు అండగా నిలవాలని జనసేన అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మీదేవిపేటలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కాఫీ విత్ కేడర్‌తో నిర్వహించిన కార్యక్రమంలో కొణతాల మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ తొలగించిన పేదల పింఛన్‌లను పునరుద్ధరిస్తామన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీలోకి చేరిన యువకులకు కొణతాల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, భరణికాన నరసింహమూర్తి, లక్ష్మీదేవిపేట పెద్దలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, మార్చి 24 : పట్టణంలో ప్రసిద్ధి చెందిన కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నగర సంకీర్తన, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో శతజయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

పరవాడ, మార్చి 24: దేశపాత్రునిపాలెం పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా స్థానిక పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పండూరి వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో పోలమాంబ యూత్ ప్రతినిధులు కర్రి వినోద్, కర్రి రవికుమార్, రామ్‌నగేష్, జెర్రిపోతుల నిఖిల్, సాయిప్రదీప్, లోహిత్, స్థానిక నాయకులు శనివాడ ప్రకాష్, మచ్చా శివకుమార్, అచ్చారావు, బాబూరావు పాల్గొన్నారు.

275 మందికి ఉచిత కంటి పరీక్షలు



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, మార్చి 24: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 123వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 275 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 155 మందికి ఉచిత కంటి అద్దాలు ఇవ్వగా.. 90 మందికి మందులిచ్చారు. మరో 30 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో శస్త్రచికిత్సలు చేయిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారందరికి మజ్జిగ, ఫలహారాలు, భోజన సదుపాయం కల్పించామన్నారు.

పౌరసత్వ సవరణ బిల్లును రద్దు చేయాలి: సీపీఎం

రాంబిల్లి, మార్చి 24 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీఏఏ పౌరసత్వ సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలంలోని కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెం కొత్తపేట, అప్పన్నపాలెం తదితర గ్రామాల్లో పౌరసత్వ సవరణ బిల్లును రద్దుచేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవుడునాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు దొడ్డిదారిన ఈ బిల్లును తీసుకువచ్చి అమోదించాలని రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకురావాడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నేతలు చందక రామకృష్ణ, సీహెచ్ నూకన్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌పై విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఎలమంచిలి, మార్చి 24 : పట్టణంలోని ఫ్లై ఓవర్‌పై వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు. చీకటి పడితే బ్రిడ్జిపై నుంచి ప్రయాణించేందుకు పాదచారులు ఆందోళనకు గురికావాల్సి వస్తుందని అంటున్నారు. బ్రిడ్జిపై రాత్రి వేళల్లో వాహనదారులు సైతం విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్లైఓవర్‌పై విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సత్వరం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ

సబ్బవరం, మార్చి 24 : మండలంలోని అమృతపురంలో బంగారమ్మ, కుంచాలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి వివిధ రకాల పూజలు నిర్వహించి కలశ ప్రతిష్ఠను చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బైలపూడి గౌరి, ఎంపీటీసీ సభ్యుడు సింగంపల్లి శ్రీను, మాజీ సర్పంచ్ గండి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బైలపూడి రామారావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

సబ్బవరం, మార్చి 24: మండలంలోని అంతకాపల్లిలో ముత్యాలమ్మతల్లి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ-2చొక్కాకుల గోవింద, మాజీ ఎంపీపీ ముత్యాలనాయుడు, పాలిశెట్టి సురేష్‌రాజ్ పాల్గొన్నారు.

వార్డుల్లో కొణతాల గెలుపు కోసం ప్రచారం



81వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 24 : పట్టణంలోని 80, 81వ వార్డుల్లో జనసేన అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి కొణతాల రామకృష్ణ విజయాన్ని ఆకాంక్షిస్తూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అంబేడ్కర్‌నగర్‌లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి బీఎస్ఎంకే జోగినాయుడు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అలాగే 81వ వార్డులోని సంతోషిమాత ఆలయం, దిబ్బవీధి ప్రాంతాల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జి మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో నాయకులు గాజుగ్లాస్ గుర్తును చూపిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారాల్లో కొణతాల బాలసుబ్రహ్మణ్యం, పీలా రాముడు, కొణతాల అప్పలరాజు, మద్దాల నారాయణరావు, పీలా రమణారావు, బొడ్డేడ మురళీ, మర్రా జోగ నూకేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు క్షయ వ్యాధిపై అవగాహన

ఎలమంచిలి, మార్చి 24: క్షయ వ్యాధి నివారణపై ఆదివారం కొక్కిరాపల్లి బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు ప్రిన్సిపాల్ ఎం. మాణిక్యం, వైద్య సిబ్బంది ఎం. విజయలక్ష్మి అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమలు కాని కోడ్!

- ఇప్పటికీ పలు గ్రామాల్లో శిలాఫలకాలు, హోర్డింగ్‌లపై కనిపిస్తున్న ముఖ్యమంత్రి, మంత్రుల ముఖ చిత్రాలు
- పట్టించుకోని అధికారులు
- విమర్శలు గుప్పిస్తున్న ప్రజలు



మాడుగుల : సాగరంలో ట్యాంకు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంపై నేటికీ దర్శనమిస్తున్న మంత్రుల ఫొటోలు



మంచినీటి పథకం ట్యాంకుకు ఉన్న వైసీపీ జెండా రంగులు

మాడుగుల, మార్చి 24 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చి దాదాపు వారం రోజులు కావస్తున్నా నేటికీ కొన్నిచోట్ల శిలాఫలకాలు, బోర్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు కనిపిస్తూనే ఉన్నాయి. ఓ గ్రామంలో అయితే మంచినీటి పథకం ట్యాంకుకు గతంలో వేసిన వైసీపీ జెండా రంగులు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. వీటిని చూసినవారు అధికారుల పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. స్వయానా ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను సైతం సదరు అధికారులు పట్టించుకోకపోవడాన్ని తప్పుబడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగడంతో పాటు ఆయా పార్టీల ఫ్లెక్సీలు, జెండాలు కనిపించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ మండలంలోని సాగరం గ్రామంలో ఏర్పాటుచేసిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకుకు గతంలో వేసిన వైసీపీ జెండా రంగులు ఇప్పటికీ అలాగే కనిపిస్తున్నాయి. ఇక్కడి శిలాఫలకంపై ముఖ్యమంత్రి జగన్, మంత్రి బూడి ముత్యాలనాయుడు ఫొటోలు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం మాడుగుల సమీపంలోనే ఇలా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతుండడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వీటిపై స్పందించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

నర్సీపట్నం అర్బన్ : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మండలంలోని ఓఎల్‌పురం మెయిన్ రోడ్డులో ఓ ప్రైవేటు ఆస్పత్రి ఏర్పాటు చేసిన హోర్డింగ్‌పై ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉండడాన్ని ప్రతిపక్ష పార్టీలనాయకులు తప్పుబడుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన ప్రచారంతో కూడిన ఈ చిత్రాన్ని చూసినవారు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. నిబంధనలను అధికారులు అమలు చేయాలని ఈసీ ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇలా పలుచోట్ల బోర్డులు కనిపిస్తుండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఓఎల్ పురం మెయిన్ రోడ్డులో ఓ ఆస్పత్రి ఏర్పాటు చేసిన హోర్డింగ్‌పై ప్రస్తుతం దర్శనమిస్తున్న సీఎం జగన్ చిత్రం

కూటమి ఎంపీ అభ్యర్థి ఖరారు

... 5వ పేజీ తరువాయి

పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపునందుకొని టీడీపీలో చేరారు. టీడీపీ చిత్తూరు జిల్లా ప్రచార కార్యదర్శిగా, జిల్లా ఎన్నికల ఇన్‌చార్జిగా పని చేశారు. తరువాత టీడీపీ కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2009లో టీడీపీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ తరఫున 2012లో రాజ్యసభ సభ్యుడి ఎన్నికయ్యారు. ఇదే సంవత్సరం కడప జిల్లాలో విద్యుత్ కోతలు, సాగునీరు, తాగునీరు సమస్యలు, సిమెంట్ ధర తగ్గించాలని కోరుతూ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. 2018లో రెండోసారి టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గత సాధారణ ఎన్నికల తరువాత సహచర రాజ్యసభ సభ్యులు సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్‌తో కలిసి బీజేపీలో చేరారు. అప్పటి నుంచి బీజేపీలోనే కొనసాగుతున్నారు. పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడి పనిచేశారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీకే కేటాయించడంతో సీఎం రమేశ్ ఇక్కడి నుంచి పోటీ చేయడానికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కాగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం రమేశ్‌కు ఇదే తొలిసారి.

అరకులోయ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత

పాడేరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అరకులోయ ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీత పేరు బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి జాబితాను విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లా తిమ్మాపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి గీత పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. గ్రూప్-1 అధికారిగా సేవలందించారు. రాజకీయాల పట్ల ఆసక్తి ఉండడంతో 2013లో ఉద్యోగానికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో అరకులోయ ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. 2018లో వైసీపీ అధి ష్ఠానంతో విభేదాలు రావడంతో పార్టీ నుంచి బయటకు వచ్చి జనజాగృతి పేరిట రాజకీయ పార్టీని స్థాపించారు. 2019లో బీజేపీలో విలీనం చేశారు. గత ఏడాది ఆగస్టులో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. పొత్తులో భాగంగా అరకులోయ ఎంపీ సీటు బీజేపీకి కేటాయించడంతో కొత్తపల్లి గీత అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం ఖరారు చేసింది.

అవయవదాతల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

సమ్మతి మేరకు చేయడం. 2015 నుంచి 2019 వరకు కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో భాగంగా 457 మందికి కిడ్నీ మార్పిడి, 192 మందికి లివర్, 73 మందికి హార్ట్ 92 మందికి లంగ్స్, ఒకరికి పాం క్రియాస్ మార్పిడి శస్త్రచికిత్సలను చేశారు. లైవ్ ట్రాన్స్ ప్లాంటేషన్ అంటే బతికి ఉండగానే కొన్ని అవయవాలను దానం చేసే అవకాశముంది. కుటుంబ సభ్యులకు, దగ్గరి బంధువులకు కొన్ని అవయవాలు దానం చేయవచ్చు. దీన్ని లైవ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు. ఇందుకోసం లివర్‌లో నాలుగో వంతు, కిడ్నీలో ఒకటి, బోన్ మ్యారో వంటివి ఇవ్వవచ్చు. గడిచిన తొమ్మిదేళ్లలో లైవ్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటే షన్స్ అధికంగా జరిగాయి. వీటిలో కిడ్నీ 2,498మందికి, లివర్ 30మందికి మార్పిడి చేశారు.

అవగాహనతోనే ముందుకు

గతంతో పోలిస్తే కెడావర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ పెరి గాయి. ప్రమాదాల్లో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి అవయవాలు అందించేందుకు ఎక్కువ మంది ముందుకు వస్తుండడంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల జీవితాల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయి. అవయవ దానిపై స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి.

వడ్డాదిలో ఘనంగా నాగవల్లి వసంతోత్సవం

- వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా నిర్వహణ
- భారీగా తరలి వచ్చిన భక్తజనం
- గోవిందనామ స్మరణతో మార్మోగిన పరిసరాలు



గిరిజాంబగిరి ఎక్కుతున్న భక్తులు

బుచ్చెయ్యపేట, మార్చి 24 : వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువుదీరిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో కీలక ఘట్టమైన పూర్ణాహుతి, నాగవల్లి వసంతోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. వేకుమజాము నుంచి భక్తుల రాకతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. గిరిజాంబగిరి నుంచి స్థానిక కూడలి వరకు భక్తుల కోలాహలం నెలకొంది. గజ, గరుడ వాహనాలపై శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారి తిరువాధి ఉత్సవాన్ని నిర్వహించడంతో వసంతోత్సవం ప్రారభమైంది. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు ఆనందోత్సాహాల నడుమ ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన తిరువీధి ఉత్సవం మధ్యాహ్నం 1.30 గంటలకు శారదానదికి చేరుకుంది. నదిలో పండితుల మంత్రోచ్ఛారణల నడుమ దొండా శ్రీరామ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా స్వామి వారి చక్రస్నానం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో వడ్డాది సందడిగా మారింది. భక్తుల గోవింద నామస్మరణలతో ఈ ప్రాంతమంతా మార్మోగింది. యాదవ కాలనీలో మజ్జిగ, పలుచోట్ల ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



చక్రస్నానం సందర్భంగా స్వామికి పూజ



వడ్డాదిలో వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రోలుగుంటలో భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

రోలుగుంట : మండల కేంద్రం రోలుగుంటలో వెంకన్న గిరిప్రదక్షిణను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా ఈ నెల 19వ తేదీ నుంచి ప్రతిరోజూ ఇక్కడ విశేష పూజలు జరిపారు. చివరిరోజున స్వామి వారిని రథంపై ఉంచి కొండ దిగువ ఉన్న కోనేటి నుంచి నిండుగొండ, కె.నాయుడుపాలెం, కొవ్వూరు నూకాలమ్మ గుడి మీదుగా కొండపైనున్న వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఆరు కిలోమీటర్ల మేర ఈ వేడుక సాగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాతరో... జాతర

- గ్రామాల్లో మోదకొండమ్మ, శ్రీదేవి పెద్దింటమ్మ పండగలు



మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో భక్తుల సందడి

మాడుగుల, మార్చి 24 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వేకువ జామున అమ్మవారికి విశేష అలంకరణలు జరిపిన అనంతరం అర్చకులు పూజలు నిర్వహించారు. ఆ తరువాత భక్తులకు దర్శనాలకు అవకాశం కల్పించారు. స్థానిక కొబ్బరితోట వీధికి చెందిన భక్తులు ఘటాల పండగ నిర్వహించారు. పురవీధుల గుండా మేళతాళాలతో ఘటాలను తీసుకు వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో న్యాయవాది శ్రీనాథ ప్రసాదరావు, ప్రమోద్‌లు భక్తులకు అన్నసమారాధన జరిపారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాడుగుల రూరల్ : సాగరం, డి.సురవరం, వీరనారాయణం తదితర గ్రామాల్లో ఆదివారం మోదకొండమ్మ పండగను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు తరలి వెళ్లి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భజనలు, కోలాటాలు, సాంస్కృతి కార్యక్రమాలతో ఆయాగ్రామాలు సందడిగా మారాయి. సాగరంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు మోదకొండమ్మకు దర్శించుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, మువ్వల రమణబాబు, శ్రీనాధు జగ్గారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సాగరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న బూడి

బుచ్చెయ్యపేట : విజయరామరాజుపేటలో ఆదివారం మోదకొండమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. స్థానికులతో పాటు మంగళాపురం, కుముందాంపేట, అప్పలరాజుపురం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు.

రావికమతం : మేడివాడలో మోదకొండమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకోసారి కుంచంగివారి కుటుంబీకులు ఈ వేడుక జరుపుతుండడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నేలవేషాలతో పాటు వివిధ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కుసర్లపూడిలో శ్రీదేవి పెద్దింటమ్మ జాతర

రోలుగుంట : కుసర్లపూడిలో ఆదివారం శ్రీదేవి పెద్దింటమ్మ జాతరను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా గత నాలుగు రోజుల నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు జరుపుతున్నారు. ఆదివారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



పూజలందుకున్న పెద్దింటమ్మ

వైసీపీ నుంచి టీడీపీలో పలువురు చేరిక

నర్సీపట్నం, మార్చి 24 : మండలంలోని గురందొరపాలేనికి చెందిన మాజీ ఉప సర్పంచ్ వేపాడ అర్జున్, యూత్ లీడర్ చందు, ముమ్మిన అప్పారావు, మరో 20 కుటుంబాలవారు ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కండువాలు కప్పి వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జడ్పీటీసీ సుకల రమణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, బోళం రాంప్రసాద్, ఈర్లె రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడమే అందరి లక్ష్యం కావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. జగన్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనించాలంటే అయ్యన్నపాత్రుడ్ని ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, ఉప సర్పంచ్ డి.సహదేముడు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి అయ్యన్న, జడ్పీటీసీ రమణమ్మ

'ఐక్యంగా పనిచేద్దాం.. టీడీపీని గెలిపిద్దాం'



దేవరాపల్లి : ఎం.అలమండలో మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

దేవరాపల్లి, మార్చి 24 : కలిసి కట్టుగా పనిచేస్తే మాడుగుల కోటపై టీడీపీ జెండా ఎగరడం ఖాయమని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. మండలంలోని ఎం.అలమండలో ఆదివారం ఏర్పాటైన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి బూడిని ఓడించే అవకాశం వచ్చిందని, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని పిలుపునిచ్చారు. మాజీ జడ్పీటీసీ పోతల పాత్రునాయుడు, అచ్చియ్యమ్మ, చల్లా నానాజీ రామారావు, దొగ్గ దేమున్నాయుడు, పెద్దాడ వెంకటరమణ, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : మండలంలోని పోతనపూడి అగ్రహారంలో ఆదివారం వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. వీరికి మాడుగుల కూటమి పార్టీల అభ్యర్థి పైలా ప్రసాదరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు కోరుకొండ సాంబమూర్తి, పెంటకోట రాము, దర్శిశెట్టి నారాయణరావు, సూరి అప్పారావు, మడగల వెంకటరమణ, పడాల శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : సమష్టి కృషితో నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువస్తానని మాడుగుల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు తెలిపారు. మండలంలోని అర్జునగిరిలో ఎంపీటీసీ పెంటకోట అమ్మతల్లినాయుడు, టీడీపీ నాయకులు జాజిమొగ్గల ప్రసాద్, కె.గోవింద్, జె.పాలవెల్లినాయుడు, జనసేన నాయకులు పెంటకోట సూరిబాబు, గొర్లె సుబ్రహ్మణ్యం, పురుషోత్తం, శివాజీ, బీజేపీ నాయకులు వేపాడ శ్రీనివాస్, పెంటకోట ఎరుకునాయుడు తదితరులతో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, కామిరెడ్డి ఎరుకునాయుడు, దొగ్గ బలరాం, గొర్లె రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తులు

నర్సీపట్నం, మార్చి 24 : ఇక్కడి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐదో తరగతి ప్రవేశాలు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగుల సీట్లు భర్తీకి ఆన్‌లైన్‌లో ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఏప్రిల్ 17 తేదీన హాల్‌టిక్కెట్లు మంజూరు, 25వ తేదీన పరీక్ష ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు స్కూల్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

క్షయపై అవగాహన ర్యాలీ



గిడుతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం, మార్చి 24 : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం గిడుతూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాకవరపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సీతామహాలక్ష్మి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే అది టీబీ కావచ్చునన్నారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో కఫం పరీక్షలు చేయించుకుని, వ్యాధి నిర్ధారణ జరిగితే అవసరమైన మందులు వాడాలని సూచించారు.

మూడు వరి కుప్పలు దగ్ధం

కృష్ణాదేవిపేట, మార్చి 24 : పాత కృష్ణాదేవిపేట శివారు బంగారంపేటకు వెళ్లే రహదారిలో మూడు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. అదే గ్రామానికి చెందిన గొంప శ్రీను, గొంప లోవరాజు సుమారు మూడు ఎకరాల్లో వరిని సాగు చేశారు. పంట పండిన అనంతరం కుప్పలుగా పెట్టుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం సదరు కుప్పలు కాలి బూడిద కావడంతో వారు గగ్గోలు పెడుతున్నారు. ఈ ప్రమాదంలో రూ.80 వేలు ఆస్తినష్టం జరినట్టు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించాల్సిందిగా కోరారు.

ఘనంగా మట్టల ఆదివారం

చోడవరం, మార్చి 24: మట్టల ఆదివారం పండగను ఇక్కడి గాంధీ గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా గుడ్‌ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారంనాడు ఈ వేడుకను జరుపుకుంటారు. ఇందులో భాగంగా అంతా కొబ్బరి మట్టలను చేతబట్టి ర్యాలీ జరిపారు. చర్చి ఫాదర్లు ప్రసాద్, ఇసిడోర్ టప్పో తదితరులు పాల్గొన్నారు.



చోడవరం ఆర్‌సీఎం చర్చి నుంచి క్రైస్తవుల ర్యాలీ

మాకవరపాలెం : మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఇక్కడ ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు చర్చి, పెంతకోస్తు చర్చితో పాటు మరికొన్ని చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ పాల్, వెంకటరత్నం పాల్, కిరణ్ పాల్, డానేయేలు పాల్గొన్నారు.

28న చీడికాడలో ఉత్తరాంధ్రస్థాయి ఎడ్లపరుగు పోటీ

చీడికాడ, మార్చి 24 : మండల కేంద్రం చీడికాడలో ఈ నెల 28న ఉత్తరాంధ్రస్థాయి ఎడ్లపరుగు పందెం జరగనుంది. పరువాడ కరణం కుటుంబ ఇలవేల్పు ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆరోజు ఉదయం కలశ స్థాపనతో పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు పోటీలు జరుగుతాయని, విజేతలకు తొమ్మిది భారీ బహుమతులు అందించనున్నామని చెప్పారు. పూర్తి వివరాలకు 99664 52900 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థికి నగదు పురస్కారాన్ని అందిస్తున్న సంఘ సభ్యులు

బుచ్చెయ్యపేట, మార్చి 24 : ఇక్కడి కేపీడీ జడ్పీ హైస్కూల్‌లో గత ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఆదివా రం అభినందించారు. ఈ సందర్భంగా వారు సమావేశమై సదరు విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేయడంతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సయ్యపురెడ్డి వెంకటరమణ, ప్రతినిధులు కోవెల రవి, సయ్యపురెడ్డి వరహాలుబాబు, ఎం.ధర్మజ్యోతి, త్రినాథ్ రమేష్, సయ్యపురెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై వర్క్‌షాపు

నర్సీపట్నం, మార్చి 24 : వ్యవసాయ ఆదారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహికుల కోసం ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు శారదానగర్ వేదిక ఫంక్షన్ హాల్‌లో ప్రారంభం కానున్న ఈ సదస్సును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వేములపూడి ఖాదీ సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణ కోరారు.

మరో రెండు సీట్లకు..

... 5వ పేజీ తరువాయి

నుంచి సుందరపు విజయకుమార్‌లకు చోటు దక్కింది. విశాఖ దక్షిణం సీటును పెండింగ్‌లో పెట్టారు.

తొలుత టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని జనసేన పార్టీ టీడీపీని కోరింది. పెందుర్తి, భీమిలి, గాజువాక, ఎలమంచిలి స్థానాలను అడిగినట్టు అప్పట్లో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో గత నెల 24వ తేదీన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తమ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాలను విడుదల చేశారు. అనూహ్యంగా అనకాపల్లి నుంచి జనసేన అభ్యర్థిగా కొణతాల రామకృష్ణ పేరును ప్రకటించారు. కొద్ది రోజుల తరువాత కూటమిలో బీజేపీ చేరడంతో సమీకరణాలు మారిపోయాయి. పెందుర్తి, ఎలమంచిలితోపాటు విశాఖ దక్షిణ నియోజకవర్గాలను జనసేనకు కేటాయించినట్టు వార్తలు వచ్చాయి. అధికారికంగా ప్రకటించనప్పటికీ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్.. పెందుర్తికి పంచకర్ల రమేశ్‌బాబు, ఎలమంచిలికి సుందరపు విజయకుమార్ పేర్లను ఖరారు చేసి, ఎన్నికల ప్రచారం చేసుకోవాలని చెప్పినట్టు తెలిసింది. విశాఖ దక్షిణ నియోజకవర్గం టికెట్‌పై వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కూడా హామీ లభించింది. అయితే ఆదివారం ప్రకటించిన మలివిడత జాబితాలో పంచకర్ల రమేశ్‌బాబు (పెందుర్తి), సుందరపు విజయకుమార్ (ఎలమంచిలి)కు మాత్రమే చోటు లభించింది. దక్షిణ నియోజకవర్గం ప్రస్తావనలేకపోవడంతో వంశీకృష్ణతోపాటు జనసేన వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పంచకర్ల రమేశ్ బాబు

నగరంలో వ్యాపారం చేసుకునే పంచకర్ల రమేష్‌బాబు ప్రజారాజ్యం ఏర్పాటుతో రాజకీయాల్లో ప్రవేశించి 2009లో పెందుర్తి నుంచి అసెంబ్లీకి పోటీచేసి విజయం సాధించారు. రాష్ట్రం విడిపోయిన తరువాత 2014లో టీడీపీలో చేరి ఎలమంచిలి నుంచి విజయం సాధించారు. గత ఎన్నికల్లో ఇక్కడ నుంచే టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. తరువాత వైసీపీలో చేరి పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేశారు. అక్కడ ఇమడలేక జనసేనలో చేరారు. కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకంలో భాగంగా జనసేన పార్టీకి పెందుర్తి కేటాయించడంతో పంచకర్లకు అవకాశం లభించింది.

సుందరపు విజయకుమార్

ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన సుందరపు విజయకుమార్ తెలుగుదేశం పార్టీతో రాజకీయ జీవితం ప్రారంభించారు. 2014లో ఎలమంచిలి నుంచి పోటీచేసే అవకాశం చివర్లో చేజారింది. తరువాత కొన్నాళ్లకు జనసేనలో చేరి 2019లో ఎలమంచిలి నుంచి పోటీచేసి ఓడిపోయారు. అప్పటి నుంచి పవన్‌కల్యాణ్‌కు సన్నిహితంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు అదే స్థానం నుంచి టికెట్ ఖరారైంది.